క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా సహకరిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వారి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కూడా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. అగనంపూడి శనివాడకు చెందిన గొర్లె చిన్నా కుమారుడు మౌర్య భరద్వాజ్ గుండె శస్త్రచికిత్స చేయించుకున్నాడు. దీనికి అవసరమైన రూ.90వేలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు ఆ చెక్కును బాధితుని తల్లికి గురువారం ఆయన అందజేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలోని శ్రీలక్ష్మీ గణపతి, శ్రీదత్తాత్రేయ సహిత షిర్డీ సాయిబాబా ఆలయ నాలుగో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, హోమం జరిగాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, కార్పొరేటర్ ఎం.ముత్యాలు, ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పైడిరాజు ఎస్.రాందాస్, జోగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వీధి దీపాలు ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు కండిపిల్లి వీధిలో కొత్తగా ఏర్పాటు చేసిన 8 వీధి దీపాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం రాత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు లేక స్థానికులు ఇబ్బంది పడేవారని, సమస్య తెలుసుకున్న వెంటనే అధికారులతో మాట్లాడి వీధి దీపాలు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, గొందేశి పెదరెడ్డి, అప్పలరెడ్డి, రాము, కృష్ణ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

లఘువారాహిదేవిగా మహాదుర్గ



ప్రత్యేక అలంకరణలో మహాదుర్గ అమ్మవారు

ఉక్కునగరం: వారాహి నవరాత్రుల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో మహాదుర్గ అమ్మవారిని గురువారం లఘువారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర సంపెంగ పుష్పార్చన నిర్వహించారు. భయ నివారణ, రక్షణ, విజయం కలిగేలా చేయాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 32 మంది ఉభయదాతలు, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల్లో టీడీపీ నేత పాగా

- ఖాళీ జాగాపై కన్నేసిన నాయకుడు
- పార్కింగ్ యార్డుగా మార్చి డబ్బుల వసూళ్లు
- చీకటి మాటున అక్రమ వ్యాపారం
- పట్టించుకోని అధికారులు



ఏపీఐఐసీ భూమిలో నిర్మించిన షెడ్డు



యార్డులో పార్క్ చేసిన ఆయిల్ ట్యాంకర్లు

కూర్మన్నపాలెం: ఖాళీ జాగా కనిపిస్తే చాలు టీడీపీ నాయకులు కబ్జా చేసేస్తున్నారు. ప్రభుత్వానికి నాలుగు రాళ్లు మిగిల్చే ఏ భూమి కూడా వారి దృష్టిని దాటి, పోలేని పరిస్థితి. తాజాగా గాజువాక మండలంలోని జీవీఎంసీ 86వ వార్డు పరిధి లక్కరాజుపాలెంలో ఏపీఐఐసీకి చెందిన సుమారు రెండెకరాల ఖాళీ భూముల ఆక్రమణే ఇందుకు నిదర్శనం. ఓ టీడీపీ నాయకుడు ఆ భూములను చేజిక్కించుకుని, పార్కింగ్ యార్డుగా మార్చేసి దర్జాగా డబ్బులు వసూలు చేస్తున్నాడు. వివరాలివి..

లక్కరాజుపాలెం, తలారివానిపాలెం, అగనంపూడి గ్రామాల రెవెన్యూ సరిహద్దుల్లో లక్కరాజుపాలెం గ్రామంలో ఏపీఐఐసీ (ఏపీ రిఫ్రాక్టరీస్) భూములు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఆ భూములపై స్థానిక టీడీపీ నాయకుడి కన్ను పడింది. ఆ భూములను ఆక్రమించి పార్కింగ్ యార్డుగా మార్చి, ఆయిల్ ట్యాంకర్లను పార్క్ చేస్తున్నారు. హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్ నుంచి వస్తున్న ట్యాంకర్లు రిటైల్ బంక్‌లకు వెళ్లకుండా సదరు ప్రభుత్వ భూమిలో పార్క్ చేసి, రాత్రి వేళల్లో ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్‌ను చోరీ చేస్తూ అక్రమదందాకు పాల్పడుతున్నారు. ఇలా ఆయిల్ ట్యాంకర్లను పార్క్ చేయడం ద్వారా ఒక్కొక్క ఆయిల్ ట్యాంకర్ నుంచి నెలకి 1600 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ విధంగా సుమారు 60 ఆయిల్ ట్యాంకర్లకు నెలకు 96 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. అంతటితో ఆగని ఆ నాయకుడు మరో అక్రమ దందాకు తెరలేపారు. చీకటి పడిన తర్వాత ఆయిల్ ట్యాంకర్ల నుంచి పెట్రోల్, డీజిల్‌ను తస్కరించి బహిరంగ మార్కెట్‌లో అమ్ముతూ రోజుకు లక్షల రూపాయలను ఆర్జిస్తూ అంతా తానై చక్రం తిప్పుతున్నాడు.

ఈ విషయమంతా స్థానిక ప్రజానీకానికి తెలిసినా, సదరు టీడీపీ నాయకుడి దౌర్జన్యాలకు భయపడి మౌనం వహిస్తున్నారు. ఈ భూమి అంతా తనదేనని, ఎవరైనా అడ్డు వస్తే అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నా, ఆ నాయకుడిపై అధికారులు చర్యలు చేపట్టకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. పేదవాడు గజం స్థలంలో గూడు కట్టుకుంటేనే వెంటనే వాలిపోయే ప్రభుత్వ అధికారులు ఎన్నో ఏళ్లుగా ఏపీఐఐసీ భూములు ఆక్రమించి, షెడ్డు నిర్మించి మరీ చీకటి వ్యాపారం చేస్తున్నా ఆ టీడీపీ నాయకుడిని పట్టించుకోకపోవడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఇటువంటి ఆక్రమణలపై దృష్టి పెట్టి, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పార్కింగ్ యార్డు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, ఎంట్రన్స్ గేటు

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ఏపీఐఐసీ భూములపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. భూముల ఆక్రమణపై దృష్టి సారిస్తూ, భూములకు రక్షణ కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు ఏపీఐఐసీ (ఏపీ రిఫ్రాక్టరీస్) భూములపై ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి, ఆక్రమణ గురైన భూములను స్వాధీనం చేసుకుంటాం. ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–త్రినాథరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

86వ వార్డులో రూ.2.8 కోట్లతో అభివృద్ధి పనులు

శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి



86వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో సుమారు రూ. 2కోట్ల 80 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. 1కోటి 90 లక్షల రూపాయల నిధులతో సైమన్‌నగర్, వుడా ఫేజ్–5, ఫకీర్‌తక్యా, సన్‌రైజ్ సిటీ, సాయిబాలాజీ నగర్, లక్ష్మీ గణపతి నగర్, సాయిరామ్ నగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పాతశివాలయం, సాయిరామ్ నగర్‌లలో రూ.40 లక్షలతో కాలువలు, యాతపాలెం శ్మశానవాటికలో రూ.50 లక్షలతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంలోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల నిర్మాణానికి వార్డుల్లో శరవేగంతో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, గాజువాక జోనల్ కమిషనర్ సింహాచలం, ఏఈ తులసి, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు, ముద్దపు మురళి, బొడ్డ రమణ, రాజాన నాయుడు, కాసాపు వెంకటేష్, రామకృష్ణ, రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

88వ వార్డులో రూ.20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు మంగళపాలెంలో రూ.20లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి నిర్మాణం వల్ల మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, టిడ్కో కాలనీ, రాజీవ్ స్వగృహ సముదాయాల్లో నివాసముంటున్న వేలాది మందికి ఉపయుక్తంగా ఉంటుందన్నారు. గతంలో నిర్మించిన సీసీ రోడ్డు మరమ్మతుల కారణంగా కొత్తగా రహదారి నిర్మాణం చేపట్టినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో జెడ్సీ సింహాచలం, కార్పొరేటర్ ఎం.ముత్యాలు, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి నూకరాజు, అమరపిని అప్పలరాజు, గ్రామ నాయకులు రాపర్తి అప్పారావు, మోటూరి వెంకటరమణ, మడక నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి



బలభద్ర, సుభద్రలతో జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా స్వామి గురువారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రద్యుమ్న హాలు వద్ద సుభద్ర, బలభద్ర సహితుడై కొలువుదీరారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఇంద్రద్యుమ్న హాలు వద్ద ఉదయం విష్ణు సహస్ర నామావళి పారాయణం చేశారు. సాయంత్రం సంపత్ వినాయక భజన మండలి ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సమర, కమిటీ ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, సన్యాసమ్మ, ఆలయ పూర్వీకులు గురు మోహన్, గోవిందరావు, స్థానిక నాయకులు గొల్లవిల్లి వెంకటరావు, గెద్దాడ సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, దానబాల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగ్గురమ్మల పండగ



ప్రత్యేక అలంకరణలో కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ



ప్రభల ఊరేగింపులో పాల్గొన్న గ్రామ కమిటీ ప్రతినిధులు, భక్తులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువైన శ్రీ కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ వార్ల పండగ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వేకువ జామున గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం నుంచి అమ్మవార్ల ప్రభల ఊరేగింపు నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం కుంచాలమ్మ వారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చురుగ్గా రామాలయ నిర్మాణం



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరంలో చేపట్టిన రామాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్మాణ పనులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని, వీలైనంత త్వరగా ఆలయం పూర్తి చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గొందేశి సత్తిరెడ్డి, పూతి తాతారావు, దల్లి కుంచరెడ్డి, పూతి పోతరెడ్డి, పిట్ట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి ఏకలవ్య వీధి–1లో సుమారు 69 లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన బహుళ ప్రయోజన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాల నిర్మాణంతో పాటు శ్మశానవాటికలో అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. నిర్వాసిత కాలనీల్లో ప్రజల సౌకర్యార్థం సామాజిక భవనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. వైద్యరంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని, వడ్లపూడిలో నిర్మాణం పూర్తి చేసుకున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని త్వరలోనే ప్రారంభించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ కుప్పిలి ప్రసాద్‌బాబు, ఏఈ తులసి, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, శీరపు పాపారావు, దాసరి అప్పడు, చిత్రాడ వెంకటరమణ, కోమటి రమాదేవి, ఎన్నేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు నూతన వేతనాల కోసం ధర్నా



ఆర్‌ఎంహెచ్‌పీ విభాగాధిపతి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణం నూతన వేతనాలు అమలు చేయాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మిత్రపక్షాల ఆర్.ఎం.హెచ్.పి విభాగాధిపతి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ 2017 నుంచి నూతన వేతనాలు అమలు చేయాల్సి ఉండగా 2021 అక్టోబర్‌లో ఎంవోయూ జరిగినప్పటికీ, ఇక్కడ అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. గుర్తింపు యూనియన్, యాజమాన్యాలు కార్మికులను మానసిక వేదనకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఒకవైపు ప్రైవేటీకరణ కత్తి, మరోవైపు ప్లాంట్‌ను కావాలనే నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం చేసే ప్రయత్నాలు శోచనీయమన్నారు. ఈ పద్ధతులను మార్చుకోకపోతే పోరాటాల ద్వారా యాజమాన్యానికి బుద్ధి చెబుతామన్నారు. అనంతరం విభాగాధిపతి పి. శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి. దాస్, డి.ఎస్.వి.ఎస్. శ్రీనివాసరావు, టి.వి.కె.రాజు, బి.అప్పారావు, కె.వి. సత్యనారాయణ తదితరులు పాలొన్నారు.

ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిల్వలపై తనిఖీలు

- దుకాణాలు, రెస్టారెంట్లకు రూ.30వేలు ఫైన్



రెస్టారెంట్‌లో ప్లాస్టిక్ బ్యాగ్‌లను స్వాధీనం చేసుకొంటున్న సిబ్బంది

గాజువాక : గాజువాకలోని వివిధ దుకాణాలు, రెస్టారెంట్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌లపై జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులతో కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిల్వలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ దుకాణాలు, రెస్టారెంట్ల నుంచి రూ.30 వేల అపరాధ రుసుం వసూలు చేసినట్టు సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా దుకాణదారుల నుంచి యూజర్ చార్జీలను కూడా వసూలు చేశారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అనుమతించబోమని, ఇకపై అలాంటి నిల్వలు కలిగి ఉన్నవారికి భారీగా అపరాధ రుసుం విధిస్తామని డాక్టర్ కిరణ్ కుమార్ హెచ్చరించారు.

‘విశాఖ ఉక్కు’ తెలుగు వారి ఆత్మగౌరవం

- కేంద్ర ప్రభుత్వ తీరు రాష్ట్ర ప్రజలకు అభ్యంతరకరం
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అందరి బాధ్యత
- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 861వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: తెలుగువారి ఆత్మ గౌరవానికి నిదర్శనంగా నిలిచిన విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు రాష్ట్ర ప్రజలకు తీవ్ర అభ్యంతరాన్ని కలిగిస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 861వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన కార్మికులు పాల్గొని, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతుందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తే ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

డిగ్రీ సర్టిఫికెట్ల పరిశీలనకు నేడు గడువు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగియనుంది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. మరిన్ని వివరాలకు 63058 72717 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అవ్వాతాతలకు కంటి వెలుగు

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు నేత్ర పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ





వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్‌ఆర్ కంటి వెలుగు కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ఎంతో మంది వృద్ధులకు వెలుగు ప్రసాదిస్తోంది.

మహారాణిపేట : డాక్టర్ వైఎస్‌ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుంది. శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 సంవత్సరాలు పైబడిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లద్దాలు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి కేటరాక్టు శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3394 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.

మూడు విడతల్లో వృద్ధులకు పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వా–తాతలకు కళ్ల జోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

– డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తున్నాం..




కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం చేస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరం అయితే శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. అలాగే కేటరాక్టు ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ విశ్వామిత్ర, సూపరింటిండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

నిరుద్యోగ యువతకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ జిల్లా ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్. వి.పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా రుణఅవకాశం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90596 65146, 80087 15357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యోగా విలేజ్‌లో ఫలహారశాల ప్రారంభం



ఫలహారశాలను ప్రారంభిస్తున్న ఏయూ వీసీ

ఏయూ క్యాంపస్: ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని స్వీకరించాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. గురువారం ఉదయం బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్‌లో ఏర్పాటు చేసిన ఫలహారశాలను ఆయన ప్రారంభించారు. అనంతరం సిరిధాన్యాలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మానవ ఆరోగ్యానికి ఉపయుక్తంగా నిలిచే సిరిధాన్యాలను ఉపయోగిస్తూ విభిన్న ఆహార పదార్థాల తయారీ చేస్తూ, విక్రయించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజల్లో ఆరోగ్యం, ఆహారంపై అవగాహన పెంపొందించడానికి ఈ కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, డాక్టర్ తులసీరావు, వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.